ఉప ఖజానా కార్యాలయంలో డీటీవో తనిఖీ

ఖానాపూర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ ఉపఖజానా కార్యాలయాన్ని గురువారం జిల్లా ఖజానా అధికారి (డీటీవో) సరోజ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో హాజరుపట్టికలు, ట్రెజరీ బిల్లులు, పెన్షనర్ల వివరాలు తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం బిల్లుల విషయంలో సిబ్బందికి పలుసూచనలు చేశారు. ఈ సందర్భంగా కార్యాలయానికి వచ్చిన అధికారిని సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టీవో చంద్రశేఖర్, సీనియర్ అకౌంటెంట్ ఎర్ర రవీందర్, సాయన్న, రంజిత్, పవన్, తదితరులున్నారు.

డిజిటల్ బాసర

- న్యాస్‌కామ్‌తో ఆర్జీయూకేటీ అవగాహన
- భవిష్యత్తు నైపుణ్య శిక్షణ

బాసర, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) బాసర, డిజిటల్ రంగంలో విద్యార్థులు, అధ్యాపకుల నైపుణ్యాలను పెంపొందించేందుకు న్యాస్‌కామ్‌తో గురువారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఎలక్ట్రానిక్స్ ఐటీ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో దేశాన్ని డిజిటల్ రంగంలో అగ్రస్థానంలో నిలపాలన్న లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ఫ్యూచర్ స్కిల్స్ శిక్షణను పాఠ్యాంశంలో భాగం చేయనున్నారు. ఈ ఒప్పందంతో విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్‌కంప్యూటింగ్, సైబర్‌సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో శిక్షణ లభిస్తుంది. ఉపకులపతి ప్రొఫెసర్ ఏ.గోవర్ధన్ మాట్లాడుతూ ఈ భాగస్వామ్యం విద్యార్థులను భవిష్యత్ ఉద్యోగ అవకాశాలకు సిద్ధం చేస్తుందన్నారు. ఓఎస్‌డీ మురళీదర్శన్ మాట్లాడుతూ డిజిటల్ విద్యా ఆవిష్కరణలకు మార్గదర్శకంగా నిలవనుందని అభిప్రాయ పడ్డారు.



ఎంఓయూ కుదుర్చుకుంటున్న న్యాస్‌కామ్, వర్సిటీ అధికారులు


కార్యక్రమంలో న్యాస్‌కామ్ డైరెక్టర్ ఉదయ్ శంకర్, డీన్స్ డా.చంద్రశేఖర్, డా.మహేష్, డా.విఠల్, ఫ్యాకల్టీ ఇన్‌చార్జీ డాక్టర్ దిల్‌బహార్, డాక్టర్ రాకేష్‌రెడ్డి, డాక్టర్ బాలకృష్ణ తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మళ్లీ వాన..

ఖానాపూర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాను నాలుగైదు రోజుల క్రితం వరకు అతలాకుతలం చేసిన భారీ వర్షాలు బుధవారం రాత్రి నుంచి మళ్లీ జోరందుకున్నాయి. బుధవారం రాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకు జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల ఎడతెరిపి లేకుండా కుండపోతగా వాన కురిసింది. ఈ వర్షానికి జిల్లా వ్యాప్తంగా జనజీవనం స్తంభించిపోయింది. జనం ఇళ్ల నుంచి బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. గడిచిన 24 గంటల్లో జిల్లాలో 35.8 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. ముథోల్ మండలంలో అత్యధికంగా 79.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. భారీవర్షం దాటికి ప్రాజెక్టులోకి వరద నీరు పెరుగుతోంది.

మూడు ప్రాజెక్టులకు పెరిగిన వరద ఉధృతి...

కడెం ప్రాజెక్టులోకి బుధవారం అర్ధరాత్రి 30 వేల పైచిలుకు క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో ప్రాజెక్టు ఆరు గేట్లను ఎత్తి 70 వేల క్యూసెక్కుల నీటి ని దిగువకు వదిలారు. గురువారం సాయంత్రానికి 11,649 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా ప్రాజెక్టు రెండు గేట్లను ఎత్తి 12,385 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిలో సామర్థ్యం 4.699 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 4.055 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. స్వర్ణప్రాజెక్టులోకి 1640 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 1985 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.



కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్న దృశ్యం

సమావేశాలను వినియోగించుకోవాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి డి.భోజన్న



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కాంప్లెక్స్ సమావేశాలను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి.భోజన్న అన్నారు. గురువారం అర్బన్ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న కాంప్లెక్స్ సముదాయ సమావేశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వారిని ఉద్దేశించి మాట్లాడుతూ... అన్ని పాఠశాలల్లో అకాడమిక్ క్యాలెండర్ అమలుపరచాలని, దాని ప్రకారం విద్యార్థులకు వ్యాయామ విద్యను ప్రత్యేక పీరియడ్ ద్వారా కేటాయించి అందించాలని, అన్ని పాఠశాలల్లో క్రీడా పరికరాలు కొనుగోలు చేసి అందుబాటులో ఉంచాలని, విద్యార్థులకు పీరియడ్ల వారీగా అన్ని తరగతులకు ఆటలాడిస్తూ, ఆటల నియమాల పట్ల అవగాహన కల్పించాలని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎంవో నర్సయ్య, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు మధుసూదన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

విద్యార్థి విజ్ఞాన్ మంథన్‌కి సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం జిల్లా విద్యాధికారి భోజన్న, సెక్టోరియల్ అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ... విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత ఆలోచనలను ఆవిష్కరించడం వైపు ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యార్థి విజ్ఞాన్ మంథన్ అన్ని పాఠశాలల్లో రిజిస్ట్రేషన్ చేసుకొని అత్యధిక సంఖ్యలో ఈ పరీక్షలో విద్యార్థులు పాల్గొనేలా అన్ని యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకోవాలని సూచించారు. విద్యార్థివిజ్ఞాన్ మంథన్ జిల్లా కో-ఆర్డినేటర్ నాగుల రవి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ సాంకేతిక, సమాచార సంస్థ ఆధ్వర్యంలో ఎన్‌సీఈఆర్‌టీ, విజ్ఞాన్ భారతి సంయుక్తంగా ఈ పరీక్ష నిర్వహిస్తుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9440589047 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో 1 రాజేశ్వర్, ఏఎంవో నర్సయ్య, సీఎంవో ప్రవీణ్, ఏఎస్‌సీ లింబాద్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సకాలంలో జీతాలు అందించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శలో నియమించిన సర్వీస్ పర్సనల్ స్వేచ్ఛ కార్మికుల జీతాలను నెలనెల సకాలంలో అందించాలని స్వేచ్ఛ కార్మికులు జిల్లా అధ్యక్షుడు మారుతి కోరారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో, డీఈవో భోజన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2016 నుంచి ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్నామని మా సమస్యలు ఇప్పటి వరకు పరిష్కారం కావడం లేదన్నారు. పాఠశాలలోని గదులను, మరుగుదొడ్లు, పరిసరాలను శుభ్రంగా ఉంచే మమ్మల్ని గుర్తించాలని కోరారు.

ఎత్తిపోతల దశ తిరిగేనా...?

- జిల్లాలో వృథాగా 40 లిఫ్ట్ స్కీములు
- రూ.120 కోట్లతో ప్రతిపాదనలు
- ఆధునికరిస్తే 75 వేల ఎకరాలకు నీరు
- లక్ష్మీపూర్ ఎత్తిపోతలపై రైతుల ఆశలు

నిర్మల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలో శిథిలావస్థకు చేరుకొని వృథాగా మారిన 40 ఎత్తిపోతల పథకాల మరమ్మతుల కోసం సంబంధిత అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఎత్తిపోతల పథకాలన్నింటినీ తిరిగి ఉపయోగంలోకి తేవాలన్న ఆదేశాల మేరకు కొద్ది రోజుల క్రితం ఇక్కడి ఇరిగేషన్, ఐడీసీ అధికారులు సంయుక్తంగా 120 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు రూపొందించారు. జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 42 ఎత్తిపోతల పథకాలను నిర్మించగా ప్రస్తుతం రెండు ఎత్తిపోతల పథకాలు మాత్రమే పనిచేస్తున్నాయి. మిగతా 40 పథకాలు వృథాగా మారిపోయాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు మరమ్మతులు, నిర్వహణకు సంబంధించిన నిధులు విడుదల చేయకపోవడం అలాగే రైతులు ఎత్తిపోత ల పథకాల నిర్వహణపై పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో కోట్ల రూపాయలతో నిర్మించిన ఈ పథకాల న్నీ వృథాగా మారాయి. మొత్తం ఈ 42 పథకాల కింద మొదట దాదాపు 50వేల ఎకరాల ఆయకట్టు ను స్థిరీకరించారు. ప్రస్తుతం మూడువేల ఎకరాల వరకు మాత్రమే ఈ ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు అందుతుండడం గమనార్హం. కాగా వీటన్నింటినీ పునరుద్ధరించి ప్రస్తుతం నిర్ధారించిన 50 వేల ఎకరాలకే కాకుండా మరో 25వేల ఎకరాలకు అదనంగా నీరందించాలని భావిస్తున్నారు. ఇదిలా ఉండగా 2022లో కడెం మండలం లక్ష్మీపూర్‌లో ఎత్తిపోతల పథకాన్ని నిర్మించేందుకు అప్పటి ప్రభుత్వం 49 కోట్ల రూపాయలను మంజూరు చేసింది. అయి తే ఇప్పటివరకు ఎత్తిపోతల పథకానికి సంబంధించి న పనులు మొదలు కాలేదు. ఈ ఎత్తిపోతల పథ కం కింద దాదాపు 3100 ఎకరాలకు సాగు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పథకం పూర్తి అయితే దాదాపు 78,000 ఎకరాలకు సాగునీరు అం దనుందని చెబుతున్నారు.

మరమ్మతులు జరిగేనా...?

నిర్మల్ నియోజకవర్గంలోని బస్వపెల్లి, దిలావర్‌పూర్, న్యూలోలం ఎత్తిపోతలను కలిపి ఒక ప్యాకేజీ కింద అంచనాలు తయారుచేశారు. మొత్తం 73 కోట్ల రూపాయలతో ఈ మూడుఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేసేందుకు అధికారులు అంచనాలు సిద్ధం చేశారు. అలాగే కంజర్ ఎత్తిపోతల పథకానికి రెండు కోట్లు, సముందర్‌పల్లి ఎత్తిపోతల పథకానికి ఐదు కోట్లు, టెంబరేణి ఎత్తిపోతల పథకానికి మరో ఐదుకోట్లతో పాటు నర్సాపూర్(జి) ఎత్తిపోతల మరమ్మతుల కోసం రెండుకోట్ల రూపాయలతో ప్రతిపాదనలను రూపొందించి సర్కారుకు అందించారు.

ఎత్తిపోతలకు నిధులు....

ముథోల్ నియోజకవర్గకేంద్రంలోని ఎత్తిపోతల పథకం మరమ్మతులకు మూడుకోట్ల రూపాయలతో నూ, మన్మధ్ ఎత్తిపోతల పథకం కోసం మూడు కోట్లు, పంచగుడి లిఫ్ట్ ఇరిగేషన్ మరమ్మతుల కోసం 80 లక్షలు, ఆష్టాఎత్తిపోతల కోసం మూడుకోట్లు, కౌట ఎత్తిపోతల కోసం మూడుకోట్లు, బ్రహ్మంగావ్ ఎత్తిపోతల పనుల కోసం 6 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు రూపొందించారు.



మరమ్మతులకు నోచుకోని లిఫ్ట్ ఇరిగేషన్ పథకం డొంగుర్‌గాం గ్రామం



లక్ష్మీపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభించాలనుకున్న ప్రదేశం ఇదే

బ్రహ్మంగావ్ దశ తిరిగేనా...?

కాగా జిల్లాలోని బ్రహ్మంగావ్ లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణం కోసం 80 కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ ఇప్పటివరకు ఆ పథకం ద్వారా పంట పొలాలకు చుక్కనీరు అందించలేదన్న ఆరోపణలున్నాయి. 2013లో ఈ పథకం పనులు ప్రారంభించగా 2018 లో పనులు పూర్తయ్యాయి. ఈ ఎత్తిపోతల పథకం కింద 6 వేల ఎకరాలకు సాగునీరును అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దాదాపు ఏడేళ్ల నుంచి ఎత్తిపోతల పథకం పనిచేయడం లేదు. ఈ పథకం ఊరికి దూరంగా ఉన్న కారణంగా ఇక్కడి యంత్ర పరికరాలు, ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు ఎత్తుకెళ్లినప్పటికీ పట్టించుకునే వారే కరువయ్యారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మళ్లీ ఈ పథకాన్ని కార్యరూపంలోకి తీసుకురావాలని తలపెట్టింది. దీనికోసం గాను 6 కోట్ల రూపాయలతో మరోసారి కొత్త ప్రతిపాదనలు తయారు చేశారు. దీనికి అనుగుణంగా ప్రసుత ప్రభుత్వం ఐదుకోట్ల 88 లక్షల రూపాయలను మంజూరు చేసింది. ఈ నిధులతో పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టి నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా సాగునీరందించాలని అధికారులు నిర్ణయించారు.

లక్ష్మీపూర్ ఎత్తిపోతల ఆశలు నెరవేరేనా...

కడెం మండలంలోని పాండ్వాపూర్, ఆకొండపేట, కల్లెడ, దోస్త్‌నగర్‌తో పాటు లక్ష్మీపూర్ గ్రామాల పరిధిలోని 3100 ఎకరాలకు సాగునీరు అందించేందుకు లక్ష్మీపూర్ వద్ద ఎత్తిపోతల పథకాన్ని నిర్మించాలని చాలా ఏళ్ల నుంచి ఈ ప్రాంత రైతులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 49 కోట్ల రూపాయలను మంజూరు చేసింది. ఈ ఎత్తిపోతల పథకం ద్వారా ఐదు గ్రామాల పరిధిలోని ఎనిమిది చెరువుల కింద పంట పొలాలకు సాగునీరు అందించాలని నిర్ధారించారు. అయితే ఇప్పటి వరకు ఎత్తిపోతల పథకానికి సంబంధించి పనులు మొదలు కాకపోవడంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు పట్టించుకోవాలి

- అప్పాలరాజు గంగుబాయి
రైతు, నర్సాపూర్(జి)



నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని ఎత్తిపోత ల పథకాన్ని అందించక 9 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ రైతులకు గ్రామసభ నిర్వహించి అధికారులు అప్పగించలేదు. మరమ్మతుల పేరిట ప్రజాధనాన్ని వృథా చేశారు. ప్రజాధనం వృథా చేసిన అధికారులపై విచారణ చేపట్టి ఎత్తిపోతల పథకం ఉపయోగంలోకి తేవాలి.

ఫేస్ రికగ్నేషన్ సిస్టమ్‌ను పూర్తిచేయాలి

- డీఐఈవో జాదవ్ పరుశురామ్ నాయక్



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఐఈవో జాదవ్ పరుశురామ్

భైంసా, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాలయాపన విధానాలకు తావులేకుండా విద్యార్థుల ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్‌ను సత్వరమే పూర్తి చేయాలని డీఐఈవో జాదవ్ పరుశురామ్ నాయక్ ఆదేశించారు. గురువారం భైంసా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆకస్మిక తనిఖీ చేపట్టి నిర్వాహణ వ్యవస్థను పర్యవేక్షించారు. ఎఫ్ఆర్ఎస్ పూర్తిచేయకపోవడానికి గల కారణాలను అధ్యాపక బృందాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రిన్సిపల్ శివరంజని, అధ్యాపక బృందంతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. రెండు రోజుల వ్యవధిలోగా విద్యార్థుల ఎఫ్ఆర్ఎస్‌ను పూర్తిచేయాలన్నారు. విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచి నిర్ణీత గడువులోగా సెలబస్ పూర్తిచేయాలని సూచించారు. చదువులో వెనుకబడి ఉన్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి పరిణితి సాధించేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం పలు తరగతులకు వెళ్లి అధ్యాపకుల బోధనను పరిశీలించారు. ఆయా తరగతుల్లో విద్యార్థులతో మాట్లాడి పలు విషయాలను అడిగి సమాధానాలు రాబట్టారు. తక్షణమే ఎఫ్ఆర్ఎస్ పూర్తిచేసుకోవాలని సూచించారు. ప్రణాళికబద్ధంగా చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించి భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని అకాంక్షించారు.

అటవీ అమరవీరుల దినోత్సవం



సన్మానిస్తున్న దృశ్యం

సారంగాపూర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలో చించోలి(బి) గ్రామ సమీపంలో గల గండి రామన్న అర్బన్‌పార్క్‌లో గురువారం అటవీ శాఖ అధికారులు అటవీ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో అటవీ అమర వీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అటవీశాఖ అధికారిని నాగిని, భాను మాట్లాడుతూ అటవీ పరిరక్షణలో అటవీ సిబ్బంది ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. చట్టానికి లోబడి విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. అనంతరం అటవీఅమర వీరుల కుటుంబసభ్యులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వోలు రామకృష్ణారావు, అనిత, రాథోడ్ రమేష్, రాథోడ్ అవినాష్, డిప్యూటీ ఎఫ్ఆర్‌వోలు ఎండీ నజీర్‌ఖాన్, సంతోష్‌కుమార్, రాజశేఖర్, ఇర్ఫానుద్దీన్‌లతో పాటు అటవీ అమర వీరుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

మృతదేహాలను వాగు దాటించడానికి ప్రయాస

- ప్రమాదం అని తెలిసినా దొత్తివాగు దాటిన అధికారులు
- సంఘటనా స్థలంలోనే మృతులకు పోస్టుమార్టం

పెంబి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా పెంబి మండలంలోని గుమ్మెన ఎంగ్లాపూర్ గ్రామంలో బుధవారం పిడుగుపాటుతో ముగ్గురు మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం అధికారులు పొంగిపొర్లుతున్న దొత్తివాగు దాటి సంఘటన స్థలాన్ని పరిశీలించి, సంఘటన స్థలంలోనే మృతదేహాలకు పోస్టుమార్టం చేయించారు. దంపతులైన అలకుంట లక్ష్మి, ఎల్లయ్య స్వగ్రామం పెంబి మండలంలోని నాగపూర్ కావడంతో మధ్యలో దొత్తి వాగు ఉండడంతో ఎంగ్లాపూర్ గ్రామస్థులు, అధికారులు మృతదేహాల తరలింపునకు ఎంతో కష్టపడ్డారు. మృతదేహాలను కట్టెకు కట్టి ఒకరి చేయి ఒకరు పట్టుకొని వాగుదాటించారు. నాగాపూర్ గ్రామంలో అంత్యక్రియలు చేశారు. మృతులకు కొడుకు నవీన్, కూతురు పూజ ఉన్నారు. కాగా మృతిచెందిన మరోవ్యక్తి బండారువెంకన్నకు ఎంగ్లాపూర్‌లోనే అంత్యక్రియలు పూర్తిచేయించారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారని ఎస్ఐ హన్మాండ్లు తెలిపారు.

పిడుగు పాటుతో ఎద్దు మృతి

పిడుగు పాటుతో ఎద్దు మృతి చెందిన సంఘటన బుధవారం పెంబి మండలంలోని ఎంగ్లాపూర్ గ్రామ సమీపంలోని కొలాంగూడ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కొలాంగూడ గ్రామానికి చెందిన టేకం భీమ్ రావుకు చెందిన ఎద్దు మేత కోసం రెండు ఎడ్లను వదిలి వేయడంతో ఒక్క ఎద్దు ఇంటికి రాకపోవడతో గురువారం వెతుకగా పంట చేనులో పడి ఉన్నట్లు తెలిపారు. ఎద్దు పిడుగు పాటుతో మృతి చెందిందని తెలిపారు. అధికారులు స్పందించి నష్టపరిహారం అందించాలని కోరారు.



మృతదేహాన్ని వాగు దాటిస్తున్న అధికారులు, గ్రామస్థులు

సుర్జాపూర్‌కు వచ్చిన వైద్యాధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఖానాపూర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : 'విష జ్వరాల విజృంభన' శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై జిల్లా అధికారులు స్పందించారు. సుర్జాపూర్ గ్రామంలో పలువురికి డెంగ్యూ సోకినట్లు వార్త కథనం రావడంతో పెంబి పీహెచ్‌సీ వైద్య అధికారుల బృందం సుర్జాపూర్‌కి కదలి వచ్చింది. ఈ సందర్భంగా గ్రామంలో మూడుప్రధాన కూడళ్లలో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాల ద్వారా 130 మంది ఆయా ఆరోగ్యసమస్యలతో బాధపడుతున్న వారికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ మూడు వైద్య శిబిరాలను ఖానాపూర్ ఎంపీడీవో చిక్యాల రత్నాకర్ రావు సందర్శించారు. జ్వరంతో బాధపడుతున్న వారందరికీ పరీక్షలు నిర్వహించి మందు లు అందజేయాలని వైద్యసిబ్బంది ని ఎంపీడీవో ఆదేశించారు. సుర్జాపూర్‌లో జ్వరంతో బాధపడుతున్న ఐదుగురు రోగుల నుంచి రక్త నమూనాలను సేకరించారు. రక్త పరీక్షల రిపోర్టు వచ్చిన తర్వాత వారికి మరింత ఉన్నతమైన వైద్యా న్ని అందించేందుకు చర్యలు చేపడతామని సీహెచ్‌వో మీరాబాయి, హెల్త్‌ఎడ్యుకేటర్ జయలలితలు తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ఇంటిపరిసర ప్రాంతాలలో నీరు నిల్వకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పాత్రలో ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచవద్దన్నారు. డెంగ్యూ లాంటి వ్యాధుల భారిన పడకుండా వారానికి రెండు సార్లు నిర్వహిస్తున్న డ్రైడే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సరస్వతి, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది అంజలి, యోత్స్న, రజిత, నారాయణ, తదితరులున్నారు.



వైద్య శిబిరాన్ని సందర్శిస్తున్న ఎంపీడీవో రత్నాకర్ రావు

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి

- డీపీవో శ్రీనివాస్
- లబ్ధిదారులతో సమావేశం

కుంటాల, సెప్టెంబర్, 11 : (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను వేగవంతంగా చేపట్టాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. గురువారం కుంటాల మండలంలోని విట్టాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ప్రస్తుతం ఇంటి నిర్మాణం కొనసాగుతున్న తీరు, బిల్లులు అందిన వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతంగా పూర్తిచేస్తే బిల్లులు సత్వరమే అందించేందుకు కృషిచేస్తామన్నారు. ఇండ్ల నిర్మాణం నాణ్యతతో చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వనజ, ఎంపీవో రహీం, ఏపీవో నవీన్, స్థానికులు గల్లాపురం రమేష్, తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు త్వరగా పూర్తి చేయాలి

లక్ష్మణచాంద : ఇందిరమ్మ ఇళ్ల నిర్మానం త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో రాధా రాథోడ్ అన్నారు. మండలంలోని న్యూ కంజర్ గ్రామంలో గురువారం పర్యటించారు. ఈ గ్రామ పంచాయతీలో బంటు సాయవ్వ ఇళ్లు కూలిపోవడంతో ఆమెను పునరావాస కేంద్రానికి తరలించారు. నిరుపేద కుటుంబం కావడంతో మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి లక్ష రూపాయల లోన్ మంజూరు చేయడానికి ఐకేపీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం బాబాపూర్ గ్రామ పంచాయతీలో మేస్త్రీలకు సమావేశం నిర్వహించి ఇందిరమ్మ ఇళ్లు త్వరగా పూర్తి చేయాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీవో, ఏఈ హౌసింగ్, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

వ్యవసాయ శాస్త్రవేత్తల క్షేత్రపర్యటన



పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కుంటాల, సెప్టెంబర్, 11: (ఆంధ్రజ్యోతి) :కుంటాల మండలంలోని అందకూర్ శివారులో సోయా పంటను గురువారం శాస్త్రవేత్తలు బలిరాం నేనావత్, భారతి శాస్త్రవేత్తలు హైదరాబాద్ నుంచి వచ్చి పరిశీలించారు. గ్రామానికి చెందిన శ్రీనివాస్ వ్యవసాయక్షేత్రంలో రైతు పంటకు సంబంధించిన సాంకేతిక సూచనలు తెలిపారు. ముఖ్యంగా సోయాపంటలో ప్రస్తుతం తెగుళ్లతో పాటు కాయ తోలు పోవడం గుర్తించామన్నారు. పోషకాలలోపం, అధిక వర్షాల కారణంగా రైతుకు నష్టం జరుగుతుందని వీటి నివారణకు చేపట్టవలసిన చర్యలను రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏవో విక్రమ్, ఏఈవో గణేష్, రైతులు లక్ష్మణ్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

పోలీసు పహారా మధ్య యూరియా పంపిణీ

కుంటాల, సెప్టెంబర్, 11: (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కుంటాల స్థానిక సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం పోలీసు పహారా మధ్య యూరియాను పంపిణీ చేశారు. 13 రోజుల తర్వాత గురువారం ఉదయం కుంటాలకు యూరియా రావడంతో రైతులు అధికసంఖ్యలో వచ్చి యూరియా బస్తాల కోసం ఇబ్బందులు పడే అవకాశం ఉన్నందున ముందస్తుగా పోలీసు సహకారం తీసుకొని వచ్చిన 450 బస్తాలను ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున రైతులకు పంపిణీ చేసినట్లు సీఈవో నాగభూషన్ తెలిపారు.



పహారా మధ్య యూరియా బస్తాలను పంపిణీ చేస్తున్న సిబ్బంది

ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

బజార్‌హత్నూర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బజార్‌హత్నూర్ మండల కేంద్రానికి చెందిన జడల బక్కయ్య (67) గురువారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ సంజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన జడల బక్కయ్యకు మతిస్థిమితం లేదు. ఈ క్రమంలో బుధవారం అర్థరాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. బాధితుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో గుర్తుతెలియని వృద్ధుడి మృతి

సారంగాపూర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల బస్టాండ్ సమీపంలో గురువారం ఓ గుర్తుతెలియని 65 సంవత్సరాల వృద్ధుడు అనారోగ్యంతో మృతిచెందినట్లుగా ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. మృతిచెందిన వృద్ధుని వివరాలు ఎవరికైనా తెలిస్తే 8712659516కు సమాచారాన్ని అందించాలని ఈ సందర్భంగా తెలిపారు.

డమ్మీ తుపాకీతో భయపెట్టిన వ్యక్తులపై కేసు

నిర్మల్, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): డమ్మీ తుపాకీతో ప్రజలను భయబ్రాంతులకు గురిచేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈనెల 7న పట్టణంలో జరిగిన గణేష్ నిమజ్జన సందర్భంగా నాయుడువాడలో భాగ్యనగర్ కాలనీలో భక్తాంజనేయ గణేష్ మండలి విగ్రహం ఎదుట పూదరి రంజిత్‌తోపాటు మరికొందరు వ్యక్తులు డమ్మీ తపాకీ పట్టుకొని డ్యాన్స్ చేస్తూ, అక్కడ ఉన్న ప్రజలను రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించారని, వారి ప్రవర్తనతో చుట్టుపక్కల ఉన్న ప్రజలు, నిమజ్జన శోభాయాత్రలో ఉన్న భక్తులు భయబ్రాంతులకు గురైశాంతి భద్రతలకు విఘాతం కలిగే పరిస్థితి ఏర్పడిందని పోలీసులు పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపడుతున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

అర్లి(టి)లో గంజాయి మొక్కల స్వాధీనం


మొక్కలను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

భీంపూర్, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్లి(టి) శివారులో గల బక్కి పురుషోత్తం చేనులో పోలీసులు గురువారం గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. సిబ్బందితో కలిసి చేనును పరిశీలించగా 42 గంజాయి మొక్కలు లభించినట్లు ఎస్సై పీర్‌సింగ్ నాయక్ తెలిపారు. రైతుపై ఎన్‌డీపీఎస్ కింద కేసు నమోదు చేశారు. పురుషోత్తంను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. గంజాయి సాగు చేయడం నేరమని తెలిపారు.


శిథిలాల కింద పత్రాలు


కలెక్టరేట్ ప్రధాన ద్వారం


కూలిన భవనం బాల్కనీ

కూలిన కలెక్టరేట్ బాల్కనీ పైకప్పు

» తప్పిన ప్రాణాపాయం..

ఆదిలాబాద్‌టౌన్, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జిల్లా అధికార యంత్రాంగం నిత్యం బిజీబిజీగా గడిపే కలెక్టరేట్ భవనంలో ఏ సెక్షన్ బాల్కనీ కుప్పకూలింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో శిథిలావస్థకు చేరినస్లాబు పడిపోవడంతో సిబ్బంది తీవ్రభయాందోళనలకు గురయ్యారు. స్లాబ్ నెమ్మదిగా కూలడంతో ప్రత్యామ్నాయ మార్గం గుండా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బయటపడ్డారు. నిజాంకాలంలో నిర్మించిన భవనం గతకొన్నేళ్ల నుంచే శిథిలావస్థకు చేరుకుంది. రెండేళ్ల కిందట న్యూ హౌజింగ్ బోర్డ్ పరిధిలో నూతన భవన నిర్మాణానికి పనులు ప్రారంభించగా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇదే క్రమంలో కలెక్టరేట్ బాల్కనీ పైకప్పు కుప్పకూలడం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశమైంది. మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష ఉండడంతో అధికారులు, సిబ్బంది కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఉన్న సమయంలో స్లాబ్ పడిపోయింది. అయితే స్లాబ్ నెమ్మదిగా కింద పడడంతో మిగిలిన సిబ్బంది బయటకు వెళ్లేందుకు ఆస్కారం ఏర్పడింది. ఘటనలో ప్రాణాపాయం తప్పడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. సాయంత్రం సమయం కావడం, ప్రజలు, అధికారులు ఎవరూ లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కొత్తభవనం నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు, ప్రజలు కోరుతున్నారు.

పరామర్శ

లక్ష్మణచాంద, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్‌ను నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు, బీఆర్ఎస్ పార్టీ నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి నాయకులు కొరిపెల్లి రాంకిషన్ రెడ్డి గురువారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్రీనివాస్ తండ్రి ఈటెల భూమన్న రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మరణించిన సంగతి తెలిసిందే. విషయం తెలుసుకున్న వారు మండల కేంద్రమైన లక్ష్మణచాందకు వచ్చి శ్రీనివాస్‌తో పాటు ఆయన కుటుంబాన్ని ఓదార్చి ధైర్యం చెప్పారు.

యువ వికాస్ ద్వారా యువతకు రుణాలు మంజూరు చేయాలి

ఆదిలాబాద్‌రూరల్, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): యువతకు యువవికాస్ ద్వారా ప్రభుత్వం రుణాలను మంజూరు చేసి నిరుద్యోగ యువతను ఆదుకోవాలని జిల్లా యువజన సంఘాల సమితి అధ్యక్షుడు ఎర్రం నర్సింగరావు అన్నారు. ప్రభుత్వం యువవికాస్ పథకం ద్వారా యువతకు జూన్ 2న రుణాలు ఇస్తామన్న ఇంతవరకు ఇవ్వడం లేదని అన్నారు. ప్రజలకు మాట ఇచ్చి ఆరు నెలలు గడుస్తున్న ఇంతవరకు ఇటువంటి ప్రకటన ప్రభుత్వం చేయకపోవడం శోచనీయమని అన్నారు.

ఎన్‌సీసీ శిక్షణా శిబిరం ప్రారంభం

కాడేట్‌లకు దిశానిర్దేశం చేసిన అధికారులు



సూచనలు చేస్తున్న అధికారులు


శిబిరంలో పాల్గొన్న కాడేట్లు

ఆదిలాబాద్‌టౌన్, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): 1930లో స్థాపించిన ఎన్‌సీసీ నేడు ప్రపంచ దేశాల్లో అతిపెద్ద యూత్ ఆర్గనైజేషన్‌గా వ్యాపించిందని కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ విక్రమ్ ప్రతాప్‌సింగ్ అన్నారు. గురువారం జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో 32వ తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో ఏటీసీ 3వ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. పదిరోజుల పాటు జరిగే ఈ శిక్షణకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై క్యాడెట్లకు ఎన్‌సీసీ లక్ష్యాలను తెలియజేశారు. అనంతరం క్యాడెట్ల ధృడత్వం, క్రమశిక్షణ అలవాట్ల గురించి వివరించారు. కమాండింగ్ అధికారి కల్నాల్ విక్రమ్ ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ 1930లో స్థాపించిన ఎన్‌సీసీ స్వాతంత్రం తర్వాత ఆర్మీ యాక్టివిటీస్ గురించి శిక్షణ ఇవ్వడం ప్రారంభించిందన్నారు. ఇందులో నేవీ, ఎయిర్ ఫోర్స్ చేయడంతో ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద యువతని ఆర్గనైజేషన్‌గా గుర్తింపు పొందిందన్నారు. ఎన్సీసీలో దేశ రక్షణతోపాటు క్రమశిక్షణ, నాయత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతల గురించి తెలియజేయడం జరుగుతుందన్నారు. అందుకోసం పది రోజుల శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కల్నల్ అవిరంద్‌కుమార్ కిచ్చర్, సీనియర్ అధికారి గాలి అశోక్, రజిత, ఫుట్ల లక్ష్మణ్, భూమన్న, మధురావు, తదితరులు ఉన్నారు.

ఏజెన్సీలో అడ్డగోలు దందా

(5వ పేజీ తరువాయి...)

వారి పోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై హైవే డీఈ సుభాష్‌ను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

నేలకొరుగుతున్న భారీ వృక్షాలు

ల్యాండ్ లెవలింగ్ పేరిటా రైతులకు రూ.లక్షలు ముట్టచెప్పి మొరం క్వారీలను తవ్వుకుంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుంటున్న కాంట్రాక్ట్ కంపెనీలు నిబంధనలకు విరుద్ధంగా మొరం తవ్వకాలను చేపడుతున్నాయి. తవ్వకాల్లో భారీవృక్షాలు నేలకొరుగుతున్న అటవీశాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాల్టా చట్టం కింద అటవీశాఖకు ఎంతో కొంత చెల్లించి చేతులు దులుపుకుంటున్నారు. బడా కాంట్రాక్ట్ కంపెనీలు రైతులకు డబ్బును ఆశచూపి బుట్టలో వేసుకుంటున్నాయి. ఆ తర్వాత ఎవరికీ అనుమానం రాకుండా ల్యాండ్ లెవలింగ్ పేరిట రహస్యంగా రైతులతో ఒప్పందాలు చేసుకుంటున్నారు. అసలు ల్యాండ్ లెవలింగ్ అంటే ఎత్తు పల్లాలుగా ఉన్న భూమిని పంటల సాగుకు అనుగుణంగా చదును చేసుకోవాల్సి ఉంటుంది. కానీ ఉన్న భూముల్లో భారీ గుంతలు తవ్వి రోడ్డు నిర్మాణ పనులకు మొరాన్ని తరలించడం ఏవిధంగా ల్యాండ్ లెవలింగ్ అవుతుందో సంబంధిత అధికారులకే తెలియాలన్న విమర్శలు వస్తున్నాయి.

ధ్వంసమవుతున్న రోడ్లు

బేల మండలంలోని ఆదివాసీ గ్రామాల మీదుగా భారీ వాహనాలను నడపడంతో రోడ్లన్ని పూర్తిగా ధ్వంసమై పోతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఐదు రోజుల క్రితం భవానిగూడ గ్రామస్థులు రోడ్డుపై ఆందోళనకు దిగారు. తమ గ్రామం గుండా భారీ వాహనాలను నడపవద్దంటూ హెచ్చరించారు. పంచాయతీరాజ్‌శాఖ నిబంధనల ప్రకారం గ్రామీణ రోడ్లపై కేవలం పది టన్నుల బరువు కలిగిన భారీ వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుంది. కానీ 17 నుంచి 20 టన్నుల మొరం డంపర్లను నడుపడంతో రోడ్లన్నీ గుంతలు పడి ధ్వంసమై పోతున్నాయి. దీంతో ప్రజాధనం వృధాగా మారుతుంది. సంబంధితశాఖ అనుమతులు లేకుండానే భారీ వాహనాలు నడపడం విరుద్ధమని ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

గమ్యం లేని ప్రయాణం

లక్ష్యం లేని చదువు వ్యర్థం

» ఎమ్మెల్యే బొజ్జుపటేల్



మాట్లాడుతున్న బొజ్జుపటేల్

ఉట్నూర్, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): గమ్యం లేని ప్రయాణం.. లక్ష్యంలేని చదువు వ్యర్థమని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ అన్నారు. ప్రతీ విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. గురువారం మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణం ఎదురుగా ఉన్న ఫంక్షన్ హాల్‌లో ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్‌డేకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తాము పడిన బాధలు తమ పిల్లలు పడవద్దని తల్లిదండ్రులు ఎన్నో కష్టాలకు ఓర్చుకుంటూ చదివిస్తున్నారన్నారు. తల్లిదండ్రుల కలలు నేరవేరుతాయని ఆకాంక్షించారు. కళాశాల నివేదికను ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్ వినిపించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రూప్-1 అవకతవకలపై కమిషన్ వేసి విచారించాలి

» దొంగలు ఎవరో తేల్చాలని బీఆర్ఎస్‌వీ నిరసన


నిరసన తెలుపుతున్న నాయకులు

ఉట్నూర్, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్-1 ఫలితాల అవకతవకలపై కమిషన్ వేసి విచారణ చేపట్టాలని, దొంగలు ఎవరో తేల్చాలని బీఆర్ఎస్‌వి ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. మండల కేంద్రంలోని అంబేద్కర్‌చౌరస్తాలో బీఆర్ఎస్‌వీ, బీఆర్ఎస్ నాయకులు ప్లకార్డులు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణిరాజేశ్ మాట్లాడుతూ హైకోర్టు తీర్పు రేవంత్‌రెడ్డి సర్కారుకు చెంపపెట్టని అన్నారు. కాంగ్రెస్ సర్కారు అంటేనే స్కామ్ అని నిరూపితమైందని విమర్శించారు. బీఆర్ఎస్ ఖానాపూర్ ఇన్‌చార్జీ జాన్సన్‌నాయక్, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు నిరసన తెలిపినట్లు పేర్కొన్నారు. నిరుద్యోగుల పట్ల నిరక్ష్య వైఖరి వీడాలన్నారు. నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే నిరుద్యోగుల పక్షాన ఎంతటి పోరాటినకైనా బీఆర్ఎస్ సిద్ధంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సలీం, నాయకులు దూట మహేందర్, సాజిద్‌సిద్దికి, కుర్సెంగ భూమన్న, అజ్మీరాజయచంద్ర, రాజన్న, బొడ్డునరేష్, పడిదెంశ్రీకాంత్, కుమ్రకోటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

బాసర, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి) : భైంసా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బాసర ఆలయంలోని వరద బాధితులకు విస్తృతంగా సహాయం అందించారు. ఇటీవల కురిసిన భారీవర్షాల కారణంగా టాక్లీ, బిదరెల్లి, దూడపూర్, లాబ్ది గ్రామాలు తీవ్రంగా నష్టపోవడంతో గురువారం టాక్లి గ్రామంలోని శివాలయ ప్రాంగణంలో సుమారు వెయ్యిమంది వరద బాధితులకు నిత్యావసర వస్తువులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు వేమూరి లక్ష్మీ మాట్లాడుతూ పేదప్రజలకు లయన్స్ క్లబ్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు లయన్స్‌క్లబ్ ప్రతినిధులు మోహన్‌రావుపటేల్, కదం అభయ్‌రాజ్, ద్వారక అగర్వాల్, వి.శివాజీలను సన్మానించారు. అలాగే నాయకులు మాదవరావు పటేల్, ప్రకాష్‌పటేల్, పీరాజ్‌పటేల్, యోగేష్, పటేల్, దీపక్, గణేష్‌పటేల్, జైవంత్‌రావు, శంకర్‌పటేల్, కాశీనాథ్, పటేల్ తదితరులు పాల్గొన్నారు.

'ఆది కర్మ యోగి అభియాన్' విజయవంతం

నర్సాపూర్(జి), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూరుగుపల్లి, అంజనీ తండా గ్రామాల్లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన 'ప్రధాన మంత్రి ఆదికర్మ యోగి అభియాన్' (పీఎం-ఏకేవైఏ) కార్యక్రమం కింద నిర్వహించిన గ్రామస్థాయి సమావేశాలు విజయవంతంగా ముగిశాయి. ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో తిరుపతి రెడ్డి సహా పలువురు ప్రభుత్వ అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్థానిక అభివృద్ధిపై చర్చించారు. సమావేశంలో విద్య, వైద్యం, తాగునీరు, అటవీ సంరక్షణ, గ్రామీణ సంక్షేమం వంటి పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (ఎంపీడీవో) పుష్పలత, మండల పరిషత్ ఆఫీసర్ (ఎంపీవో) తిరుపతి రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ (ఆర్‌డబ్ల్యూఎస్), హాస్టల్ వెల్ఫేర్‌ఆఫీసర్ (హెచ్‌డబ్ల్యూవో), అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ (ఏపీఎం), ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ (ఎఫ్‌బీవో), స్కూల్ హెడ్ మాస్టర్ (హెచ్‌ఎం), ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

బాసర అభివృద్ధిపై మాట్లాడే అర్హత లేదు

● ముథోల్ బీజేపీ ప్రతినిధుల బృందం


సమావేశంలో పాల్గొన్న బీజేపీ ముథోల్ నియోజకవర్గ ప్రతినిధులు

భైంసా, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దశాబ్దకాలంగా దేవాదాయ శాఖ మంత్రిగానున్న సమయంలో అమ్మవారి క్షేత్ర ప్రగతిని విస్మరించిన మాజీ మంత్రి అల్లోల్ల ఇంద్రకరణ్ రెడ్డికి ప్రస్తుతం బాసర అభివృద్ధిపై మాట్లాడే అర్హత ఎంత మాత్రం లేదని ముథోల్ నియోజక వర్గ బీజేపీ ప్రతినిధుల బృందం పేర్కొంది. గురువారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో బీజేపీ భైంసా పట్టణ కమిటీ అధ్యక్షుడు రావుల రాము, నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు సిరం సుష్మారెడ్డి, సాయినాథ్ పాటిల్, నవీన్, లక్ష్మారెడ్డిలు సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బాసర ప్రగతికి కోసం కేటాయించిన రూ.50 కోట్ల నిధులు ఎందుకు వినియోగించలేదని ప్రశ్నించారు. పదవీకాలంలో అమ్మవారి క్షేత్ర అభివృద్ధి పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన మాజీ మంత్రి అల్లోల్ల బుధవారం జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపల్లి చేపట్టిన బాసర పర్యటనలో పాల్గొని అక్కడి ప్రగతిపై మాట్లాడటం హస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈనెల17న ప్రధాని మోదీ జన్మదినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని బీజేపీ శ్రేణులు గ్రామగ్రామాన సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సేవ పక్షం జిల్లా కో కన్వీనర్ యాతలం చిన్నారెడ్డి పిలుపునిచ్చారు.

మంత్రి పర్యటనలో అల్లోల వర్గీయుల హవా

నర్సాపూర్(జి), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఎక్సైజ్, పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు నిర్మల్ పర్యటన సందర్భంగా నర్సాపూర్(జి)లో జరిగిన అనూహ్యపరిణామం స్థానిక రాజకీయాలను వేడెక్కించింది. సాధారణంగా ప్రభుత్వ పర్యటనలకు అన్ని వర్గాల నాయకులు హాజరవుతారు. అయితే ఈసారి కేవలం మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి (అల్లోల వర్గీయులు) వర్గానికి చెందిన వారు మాత్రమే ఘనస్వాగతం పలకడం అందరి దృష్టికి ఆకర్షించింది.

రాజకీయ సమీకరణాల్లో మార్పులు...

ఈ ఘటన స్థానిక రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలికింది. ఎన్నికలు దగ్గర పడుతున్న ఈ తరుణంలో ఐకే రెడ్డి వర్గీయులు మంత్రి జూపల్లిని కలవడం, తమ ప్రాబల్యాన్ని మరోసారి చాటుకోవడం గమనార్హం. ఇతర వర్గాల నాయకులు ఈ పర్యటనకు దూరంగా ఉండటం రాజకీయ వర్గాల్లో అనేక ఊహాగానాలకు దారితీసింది. ఇది రానున్న ఎన్నికల్లో కూటములు, పొత్తుల విషయంలో కీలక మార్పులకు సంకేతం కావచ్చు.

మంత్రి దృష్టికి సమస్యలు...

ఈ సందర్భంగా ఐకేరెడ్డి వర్గీయులు మంత్రి జూపల్లికి తమ ప్రాంత సమస్యలను వివరించారు. ముఖ్యంగా ఇటీవల భారీ వర్షాలకు దెబ్బతిన్న దేవుని చెరువు గండి గురించి, మత్స్యకారులకు సంబంధించిన రూ. 10 లక్షల నష్టం గుఉరించి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ నాయకులు వేణుగోపాల చారి, మాజీ సర్పంచ్ అరుగుమీది రాంరెడ్డి, మాజీ జడ్పీటీసీ అరుగుమీది చిన్న రామయ్య వంటి ప్రముఖులు పాల్గొని, మంత్రిని శాలువాలతో సత్కరించారు.

ప్రభుత్వంపై అంచనాలు...

మత్స్యకారులకు ప్రభుత్వం తక్షణమే సహాయం అందించాలని, ముఖ్యంగా బోయ కులస్తులు గాడి ప్రభాకర్, రవి వంటి వారు తమ జీవనోపాధిని కోల్పోయారని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటన ద్వారా అల్లోల వర్గీయులు తమ స్థానిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో విజయం సాధించారు. ఇది కేవలం ఒక పర్యటన మాత్రమే కాదు స్థానిక రాజకీయ ముఖ చిత్రాన్ని మార్చే ఒక కీలక పరిణామం. రాబోయే రోజుల్లో ఈ సంఘటన నర్సాపూర్ రాజకీయాల్లో ఎలాంటి మలుపులకు దారి తీస్తుందో చూడాలి.


మండలకేంద్రంలో మంత్రికి ఘనస్వాగతం పలికిన నాయకులు

లక్ష్మణచాందలో భారీ వర్షం


మునిపెల్లి గ్రామసమీపంలో నీట మునిగిన పంటలాలు


మల్లాపూర్ గ్రామంలో జలమయమైన ప్రధాన రోడ్డు

లక్ష్మణచాంద, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గురువారం భారీ వర్షం కురిసింది. ఆయా గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వీధుల్లో రోడ్లన్ని వర్షపు నీటితో నిండిపోయి రాకపోకలకు అంతరాయం కలిగింది. వాగు, సెలయేర్లు, వరద కాలువలు, చెరువులు గల ప్రాంతాల్లోని పంటపొలాలు నీట మునిగిపోయాయి. అలాగే జిల్లావ్యాప్తంగా కూడా భారీ వర్షం కురిసింది. నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ విడుదల చేసిన వర్షపాత నివేదిక ప్రకారం అత్యధికంగా ముథోల్ మండలంలో 79 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా లక్ష్మణచాంద మం డలంలో 36.2 మల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావటం విశేషం. జిల్లా మొత్తం మీద 680 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా సగటు వర్షపాతం 35.8 మిల్లీమీటర్లుగా నమోదు కావటం గమనించదగినది.

ముథోల్ : మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం రాత్రి, గురువారం ఉదయం భారీవర్షం కురిసింది. దీంతో కొంతమట్టుకు రైతులు ఇంటి పట్టున ఉండిపోయారు. మండలంలో 79.6 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసిందని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయండి

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని గురువారం ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకి కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇచ్చినట్లు తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్య సంఘం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నాలుగు సంవత్సరాలుగా కళాశాలలో చదువుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు రావాల్సిన ఆర్‌టీఎఫ్ విడుదల కానందున అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పట్టభద్రులమైన మేము స్థాపించిన కళాశాలలో ఎటువంటి ఫీజులు వసూలు చేయకుండా కేవలం ప్రభుత్వమే ఇస్తున్నటువంటి ఆర్‌టీఎఫ్ ఆధారంగా విద్యార్థులు మా కళాశాలలో చదువుతున్నారు. కానీ గత నాలుగు సంవత్సరాలుగా స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల కానందువలన కళాశాలలపై తీవ్రమైన ఆర్థిక ఒత్తిడి ఏర్పడిందని దీని వలన బోధన, బోధనేతర సిబ్బందికి వేతనాలు చెల్లించలేకపోతున్నామని, కళాశాల భవనాల అద్దెలు నిర్వహణ ఖర్చులు భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. వెంటనే బకాయిలను విడుదల చేసి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యాజమాన్య సంఘం సభ్యులు సాయిలు, సిహెచ్. వెంకట్ రెడ్డి, ప్రమోద్ రావు, అఖిలేష్ సింగ్, నర్సారెడ్డి, సతీష్ రెడ్డి, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న సంఘం సభ్యులు

ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి

● హౌసింగ్ డీఈఈ దయానంద్


సమావేశంలో మాట్లాడుతున్న డీఈఈ దయానంద్

ముథోల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు వెంటనే పనులు ప్రారంభించాలని హౌసింగ్ డీఈఈ దయానంద్ అన్నారు. మండల కేంద్రమైన ముథోల్‌లోని మండల అభివృద్ధి కార్యాలయంలో గల సమావేశ మందిరంలో గురువారం ఇందిరమ్మ లబ్ధిదారులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముథోల్ మండలానికి మొదటివిడతలో 489 ఇళ్లు మంజూరు కాగా ఇందులో 281 మంది లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లకు మార్కౌట్ వేశారని పేర్కొన్నారు. అందులో 170 మంది ఇళ్లు బేస్మెంట్ వరకు పనులు జరుగగా మరికొందరివి ఇళ్లపనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మరో 144 మంది ఇప్పటివరకు మార్కౌట్ చేసుకోలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత లబ్ధిదారులు వెంటనే ఇందిరమ్మ ఇళ్లకు మార్కౌట్ చేసుకొని పనులు ప్రారంభించాలని సూచించారు. ప్రభుత్వం అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే ఇళ్లు మంజూరైన వారు పనులు ఆలస్యం చేయకుండా తక్షణమే నిర్మాణం చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం సొంత ఇళ్లు కల్పించాలని సంకల్పంతో ఈ పథకాన్ని ప్రారంభించినందున లబ్ధిదారులు సమయాన్ని వృధా చేయకుండా ముందుకు సాగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివ కుమార్, హౌసింగ్ ఏఈ, పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ లబ్ధిదారులు, తదితరులున్నారు.

ఆత్మవిశ్వాసంతో సాగితే ఆశించిన ఫలితాలు


సన్మానిస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ , అధ్యాపక బృందం

భైంసా, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రణాళికతో వ్యవహరిస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే అన్నింటా ఆశించిన ఫలితాలుంటాయని బాసర ట్రిపుల్ ఐటీ తెలుగు అధ్యాపకులు ముత్యం ఉల్లెంగుల వెల్లడించారు. గురువారం భైంసాలోని గోపాల్‌రావ్ పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన దిగ్విజయ్‌దివాస్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. చికాగోలో స్వామి వివేకానంద ఉపన్యసించిన సందర్భాన్ని పురస్కరించుకొని ప్రతియేటా దిగ్విజయ్ దివాస్ నిర్వహించుకోవాలన్నారు. విద్యార్థులు, యువత వివేకనందుడిని ఆదర్శంగా తీసుకొని మార్గదర్శకంగా ముందుకు సాగాలని సూచించారు. జీవితలక్ష్యాలను ఏర్పర్చుకొని వాటిని సాధించుకునేందుకు గాను నిరంతరం శ్రమించాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ కర్రోళ్ల బుచ్చయ్య మాట్లాడుతూ విద్యార్థులు జాతీయత భావాలతో వ్యవహరించాలని అకాంక్షించారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ధృడసంకల్పంతో భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం ట్రిపుల్ ఐటీ తెలుగు ఆధ్యాపకుడు ముత్యం ఉల్లెంగులను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఇందులో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో యువకుల చేరిక



బోథ్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీలోకి యువకులను ఆహ్వానిస్తున్న మంత్రి

బోథ్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రంలో జరిగిన పలు ప్రారంభోత్సవాల కార్యక్రమానికి హాజరైన జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీలకు చెందిన 124 మంది కార్యకర్తలు పార్టీలో చేరారు. సహకార సంఘం డైరెక్టర్ చట్ల ఉమేష్ ఆధ్వర్యంలో చేరికలు జరగగా నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌తో పాటు డీసీసీబీ చైర్మన్ అది పూజారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నరసయ్య, మాజీ మంత్రి ఇంద్రధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆర్. బాబురావు, కాంగ్రెస్ విచారణ రాష్ట్ర కన్వీనర్ తుల అరుణ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డిలు ఉన్నారు.

బోథ్‌ను రెవెన్యూ డివిజన్ చేయండి

బోథ్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గ కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని సీపీఐ నాయకులు మంత్రికి వినతిపత్రం అందించారు. నియోజకవర్గ కేంద్రంలో ఫైర్ స్టేషన్ డిగ్రీ కళాశాల గ్రంథాలయం, మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని కోరారు. బోథ్ ప్రాంత ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, మండల అధ్యక్షుడు ఎల్. నరేష్, పట్టణ అధ్యక్షులు కార్తీక్ తదితరులు ఉన్నారు.

కొలం తోటి తెగల అభివృద్ధికి ప్రధానమంత్రి కృషి: ఎంపీ నగేష్

బోథ్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా అత్యంత వెనుకబడి ఉన్న కొలం తోటి తెగల అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక చొరవ చూపుతున్నారని అందులో భాగంగానే ఈసారి రూ.76 వేల కోట్ల రూపాయలతో జన్మన్ కార్యక్రమం కింద నిధులు మంజూరు ఇవ్వడం జరిగిందన్నారు. ఆదివాసి కొలం తోటి గూడ అభివృద్ధిపై ప్రత్యేక నిధులు మంజూరు ఇవ్వడంతో ఆయా గ్రామాల్లో ఉపాధి కల్పనతో పాటు మౌలిక వసతులను కల్పించడం జరుగుతుందన్నారు. అత్యంత వెనుకబడి ఉన్న ఆయా జాతులను ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో అనేక కార్యక్రమాలను ప్రధానమంత్రి చేపట్టారన్నారు.

వివేకానంద ప్రసంగంపై అవగాహన



కల్లూరు వాసవి కళాశాలలో వివేకానందుని ప్రసంగం గురించి విద్యార్థులకు వివరిస్తున్న అధ్యాపకులు

కుంటాల, సెప్టెంబర్, 11, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్లూరు వాసవి కళాశాలలో గురువారం స్వామి వివేకానందుడు చికాగోలో 1983 సంవత్సరంలో అమెరికాలోని చికాగో నగరంలో జరిగిన ప్రసంగం గురించి విద్యార్థులకు వివరించారు. ప్రపంచ మతాల మహాసభ కార్యక్రమంలో భాగంగా వివేకానందుడు భారత దేశం నుండి ప్రసంగించారు. ఈ సభలో ఆయన తొలిసారి ప్రసంగం ప్రారంభించి అమెరికా సోదరులారా అని ఉద్ఘాటించగానే సభలో ఉన్న వేలాది మంది చప్పట్లతో అభినందనలతో ఉర్రూతలూగిపోయారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి ప్రిన్సిపల్‌లు సాయిలు, శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

అక్రమంగా పట్టా మార్పిడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి




తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మామడ గ్రామస్థులు

మామడ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గల తహసీల్దార్ కార్యాలయంలో గత సంవత్సరం అక్రమంగా పట్టాను బదిలీ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మామడ గ్రామస్థులు గురువారం రోజున తహసీల్దార్ శ్రీనివాస్ రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టాదారుడికి సమాచారం లేకుండా ఎటువంటి సేల్ డీడ్ పత్రాలు లేకుండానే వేరే వ్యక్తిపైకి పటాను మార్చిన అప్పటి తహసీల్దార్‌పై మార్పిడికి సహకరించిన మండల కేంద్రానికి చెందిన కొందరు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బాపయ్య, ఎం.ఆశన్న, మోతే రాజన్న, ఆశన్న, రేణి మల్లేష్, ఎర్రన్న, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్ సీడీపీవోగా శ్రీలత

ఖానాపూర్, సెప్టెంబ రు 11 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ సీడీపీవోగా ఏ. శ్రీలతను నియమి స్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. నిర్మల్ నుండి డిప్యూటేషన్‌పై వచ్చి ఖానాపూర్‌లో విధులు నిర్వహించిన నాగలక్ష్మిని సొంత స్థానానికి పంపిస్తూ ఖానాపూర్ ఐసీడీఎస్ గ్రేడ్ వన్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీలతకు సీడీపీవోగా అదనపు బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు గురువారం ఖానాపూర్ ఐసీడీఎస్ కార్యాలయంలో శ్రీలత బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖానాపూర్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే సేవలను నిరంతరాయంగా సక్రమంగా నిర్వహించేలా పకడ్బందీ చర్యలు చేపడతానన్నారు.

విద్యార్థులకు మురుగునీటితో కష్టాలు



నీటిలో నుంచి నడుచుకుంటూ వస్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంజయ్ నగర్‌లోని ఆర్‌పీఎల్ పాటశాలలో మురుగునీటితో విద్యార్థులు పడరాని ఇక్కట్లు పడతున్నారు. జిల్లా ఉన్నతాదికారులు కూతవేటు దూరంలో ఉండే పాటశాలలో బయట నుంచి వస్తున్న నీటితో కనీసం నడవలేని పరిస్థితి నెలకొంది. ఇటీవల పాఠశాల పక్కనే ఉన్న పోలీస్ క్వార్టర్స్ ను కూల్చివేయడంతో మురికికాలువ నిండిపోయి.. నీటి ప్రవాహం పూర్తిగా నిలిచిపోయింది. దీంతో పాతశాలలోకి మురికి నీరు, వర్షపు నీరు చేరి కనీసం నడవలేని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.



ఇంద్రవెల్లి అమరవీరుల స్మృతి వనాన్ని ప్రారంభించిన ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు



అమరవీరులకు నివాళులర్పిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

వీరులారా వందనం

- అమరుల యాదిలో స్మృతివనం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): 1981 ఏప్రిల్ 20న భూమికోసం, భుక్తి కోసం, విముక్తి కోసం అనే నినాదంతో పోరాడి అసువులు బాసిన ఆదివాసీ అమరులను స్మరిస్తూ వారి త్యాగాలను భవిష్యత్ తరాలు చిరకాలం స్మరించుకునేలా రాష్ట్ర ప్రభుత్వం అమరవీరుల స్మృతి వనం ఏర్పాటు చేశామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం ఇంద్రవేల్లి అమరవీరుల స్మృతి వనాన్ని ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎమ్మెల్సీ దండే విఠల్‌తో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంద్రవెల్లిలో కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షుడి హోదాలో ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి అమరవీరుల స్థూపం వద్ద దళిత, గిరిజన దండోరా బహిరంగ సభలో ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం రేవంత్ రెడ్డి అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపాన్ని స్మృతి వనంగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని, అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేశారని గుర్తు చేశారు. కోటి రూపాయలతో స్మృతి వనాన్ని అభివృద్ధి చేశామని తెలిపారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ-ఉట్నూర్ ఆధ్వర్యంలో ఇంద్రవెల్లి అమరవీరుల కుటుంబ సభ్యులకు రూ 10 లక్షల విలువగల ట్రైకార్ యూనిట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సోయం బాపురావు, మాజీ ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల్ చారి, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్, ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీ కాజల్ సింగ్, కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, ఆదివాసీ రాయిసెంటర్ జిల్లా సార్మేడీ మెస్రం దుర్గు పటేల్, రగల్ జెండా ఆశయ సాధన సమితి అధ్యక్షుడు నాగోరావు పాల్గొన్నారు.

● పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వివిధ పథకాలను అధికారులు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. అనంతరం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ళ మంజూరు పత్రాలను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో పథకాల అమలులో అధికారుల బాధ్యత కీలమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి, ఎమ్మెల్సీ దండే విఠల్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, జిల్లా కలెక్టర్ రాజర్షి షా పాల్గొన్నారు.

పనిచేయని అధికారులపై చర్యలు తప్పవు

● ఇందిరమ్మ ఇళ్లకు లంచాలు అడిగితే సమాచారం ఇవ్వండి

బోథ్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని, ప్రజల కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని అయితే అధికారులు ప్రజల సంక్షేమం కోసం కృషి చేయాలని ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. గురువారం మండల కేంద్రంలో మోడల్ ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన అనంతరం స్థానికంగా ఉన్న ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటైన సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర వ్యాప్తంగా 22 వేల కోట్ల రూపాయలతో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించడం జరుగుతుందని, నాలుగు లక్షల 50 వేల మంది లబ్ధిదారులకు కింద నిర్మాణం కొనసాగుతుందన్నారు.

డీపీవో ఎక్కడ మంత్రి ఆరా

బోథ్ మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఇన్ చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లా పంచాయతీ అధికారి ఎక్కడున్నారని అడగగా డీపీవో లేకపోవడంతో అధికారులను అడిగారు. ఆ అధికారి లేకపోవడం వల్ల అధికారులు సమాధానం చెప్పేందుకు తికమకపడ్డారు.

మంత్రికి ఘనస్వాగతం

నేరడిగొండ: మండలంలోని రోల్ మామడలో టోల్‌ప్లాజా వద్ద జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లికి బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ స్వాగతం పలికారు.

రాష్ట్రస్థాయిలో పాఠశాల పేరు నిలపండి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి



బోథ్ గురుకుల కళాశాలలో నూతన డార్మెటరీ భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యేలు

బోథ్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బోథ్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలకు మంచి పేరు ఉందని అయితే సమీప భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అయితే విద్యార్థులు ఇష్టపడి చదివి పాఠశాల పేరును రాష్ట్ర స్థాయిలో నిలపాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. గురువారం నాలుగు కోట్ల 15 లక్షల రూపాయలతో నిర్మించిన డార్మెటరీ రూమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలు ఉంటే నిర్భయంగా చెప్పాలని విద్యార్థులకు సూచించారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణంతో పేదవాడి కల సాకారం

● జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు



పిప్పర్‌వాడలో విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేస్తున్న మంత్రి

జైనథ్, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా పేదవంటి ఇంటి నిర్మాణాల కల సాకారం అయిందని రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపల్లికృష్ణారావ్ అన్నారు. గురువారం బోరజ్ మండలంలోని పిప్పర్‌వాడ గ్రామంలో పైలెట్ ప్రాజెక్ట్ కింద నిర్మించిన ఇళ్లను రిబ్బన్ కట్ చేసి అధికారులు నాయకులతో కలిసి వర్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న రైతు రుణమాఫీ, రైతు భరోసా ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం పంపిణీ మొదలగు అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికైన శశికళను సన్మానించారు. విద్యార్థులకు నోట్‌బుక్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయలశంకర్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కడెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడెం మండలంలోని హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం నచ్చన్ ఎల్లాపూర్ తండాలో హనుమాన్ ఆలయం నిర్మాణానికి గిరిజనులను చైతన్యపరిచిన కమిటీ వినతి మేరకు దాతలు సహకరించాలని తండా వాసులు కోరగా, బీఆర్ఎస్ నాయకులు మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ కానూరి సతీష్ గురువారం స్పందించి తనవంతు సహాయంగా హనుమాన్ ఆలయం నిర్మాణానికి 10 వేల రూపాయలు విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు సతీష్‌ని సన్మానించారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

కడెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన తిప్పిరెడ్డి గంగాధర్ కొద్ది రోజుల క్రితం కడెం ప్రాజెక్టు కింద వరద ప్రవాహంలో కొట్టుకుని పోవడం జరిగింది. ఇప్పటికీ ఆచూకీ తెలియకపోవడంతో తిప్పిరెడ్డి గంగాధర్ కుటుంబానికి ప్రభుత్వం తరఫున రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు ఐదు లక్షల నగదు ఆర్థిక సహాయం చేశారు.

బాసరలో భారీ వర్షం

● తగ్గిన భక్తుల రద్దీ



బాసరలో భారీ వర్షానికి జలమైన అంతర్గత రోడ్డు

బాసర, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బాసర పుణ్యక్షేత్రం భక్తులు లేక నిర్మానుష్యంగా కనిపిస్తుంది. గురువారం ఆలయ ప్రాంగణం, క్యూలైన్‌లు, అక్షర శ్రీకారం మండపాలు ఇలా అన్ని ఖాళీగా దర్శనమిచ్చాయి. దసరా నవరాత్రి ఉత్సవాల వరకు భక్తుల రద్దీ ఇలాగే ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు. దీనికి తోడు దినమంతా భారీ వర్షం కురవడంతో ఆలయ పరిసరాలన్నీ నిశ్శబ్ద వాతావరణం ఏర్పడింది.. స్థానికంగా రోడ్లన్నీ వర్షం నీరు ముంచెత్తింది.

ఆస్పత్రిలో రోగులకు ఆదరణ కరువు



ఆస్పత్రిలోకి వస్తున్న వృద్ధురాలు



తాళాలు వేసి ఉంచిన మరుగుదొడ్లు



అలంకార ప్రాయంగా ఉన్న వీల్ చైర్

- మరుగుదొడ్ల నిర్వహణ లేక తాళాలు
- అలంకార ప్రాయంగా వీల్ చైర్లు

బోథ్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన బోథ్ ఆసుపత్రిలో రోగులకు ఆదరణ కరువైంది. ఆసుపత్రిలో రోగులకు కావాల్సిన సదుపాయాలు ఉన్న వాటిని నిర్వహించకపోవడంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. రోగుల అవసరాల కోసం నిర్మించిన మరుగుదొడ్లు నిర్వహణ లేక తాళం వేసి ఉంచారు. మరోవైపు రోగులు ఆసుపత్రిలోకి తీసుకువెళ్లాలంటే అవసరమైన వీల్ చైర్లు ఉన్న వాటిలో రోగులను తరలించేవారు లేకపోవడంతో కుటుంబీకులే వృద్ధులను ఆసుపత్రిలోకి తీసుకు వెళ్తున్నారు. ప్రభుత్వం వసతులు కల్పిస్తున్న వాటిని వినియోగించడంలో విఫలం కావడం జరుగుతున్నది.

● వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వాస్పత్రిలో రోగుల కోసమే ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల వినియోగంతో పాటు కుర్చీల వినియోగం జరిగే విధంగా చూస్తామని ఆస్పత్రి సూపరింటెండెంట్ రవి పేర్కొన్నారు. తాను బాధ్యతలు తీసుకొని నెల రోజులు పూర్తి కాలేదని రోగులకు ఇబ్బందులు కలగకుండా చూస్తామన్నారు.

విద్యార్థులను బెదిరిస్తున్న అధికారిపై చర్యలు తీసుకోండి

- లేకుంటే జిల్లా మొత్తం ధర్నా, రాస్తారోకో చేస్తాం
- ఆదివాసీ సంఘాలు డిమాండ్
- తుడుం దెబ్బ జిల్లా కార్యవర్గం హెచ్చరిక



ఆదివాసీ సంఘాల నాయకులను కేజీబీవీలోకి వెళ్లకుండా ఆపుతున్న ఎస్సై కె.అఖిల్

నార్నూర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కేజీబీవీ పాఠశాలలో బుధవారం జరగిన అన్నంలో పురుగులు అనే సంఘటనపై అదే రాత్రి విద్యార్థులను ఎస్‌వో బెదిరింపు చేసిందంటూ తుడం దెబ్బ జిల్లా నాయకులు ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలోని పలు ఆదివాసీ సంఘాలు కేజీబీవీ పాఠశాలను సందర్శించి అక్కడ ఉన్న పరిస్థితులు తెలుసుకోవాలని వెళ్తే వారిని గేట్ దగ్గర పోలీస్ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో వారు గేట్ ఎదటనే నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావు ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పెందుర్ సంతోష్ మాట్లాడుతూ అధికారుల పర్యవేక్షణ లోపం ఎక్కువగా ఉందన్నారు. వాస్తవాలను చెప్పకుండా ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఏజెన్సీ ప్రాంతం ఇక్కడ ఇతరులు అధికారులుగా ఉండి తమ ఆదివాసుల పిల్లలపై పెత్తనం నడిపిస్తున్నారన్నారు. విద్యార్థులు ఉన్న వస్తావని చెపితే విద్యార్థులను బెదిరింపు చేస్తున్న ఎస్‌వో, సెక్టోరల్ ఆఫీసర్ ఇక తమ ఏజెన్సీ ఆదివాసీ చట్టాలకు విరుద్ధంగా విధులు నిర్వహిస్తూ తమ విద్యార్థులకు అన్యాయం చేస్తున్న వీరు ఇక తమ ప్రాంతానికి వద్దే వద్దు అంటూ డిమాండ్ చేశారు. వీరిపై పోలీసు కేసు నమోదు చేయాలని పేర్కొన్నారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా భారీ ఎత్తున ధర్నా కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

బోథ్ అభివృద్ధికి సహకరించండి

● ఎమ్మెల్యే జాదవ్ అనిల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

బోథ్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన బోథ్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ మంత్రి జూపల్లి కృష్ణారావు విన్నవించారు. గురువారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రానికి వచ్చేందుకు డబుల్ రోడ్డు ఏర్పాటు చేసి సెంట్రల్ లైటింగ్ కోసం నిధులు మంజూరు ఇప్పించాలని కోరారు. అంతేగాక బరంపూర్ అడెల్లి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు పెంచాలన్నారు. రోడ్డు పూర్తయితే ఆదిలాబాద్ వెళ్లేందుకు దాదాపు 70 కిలోమీటర్ల దూరం తగ్గుతుందన్నారు. నియోజకవర్గంలో జలపాతాల అభివృద్ధికి కృషి చేయాలని విన్నవించారు. కుంటాల జలపాతం వద్ద మూడు కోట్ల 80 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, అదేవిధంగా పొచ్చెర, కనకాయి, గాయత్రి జలపాతాలు అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మరోవైపు బజారత్నూర్ మండలంలోని దేగామా గ్రామంలో ఒక 150 కుటుంబాలు ప్రాజెక్టు ముంపు వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారి ఇబ్బందులను తొలగించేందుకు సహకరించాలన్నారు. రేషన్ బియ్యం మహారాష్ట్రకు తరలిపోకుండా నిఘా ఏర్పాటు చేయించాలని మంత్రికి విన్నవించారు.

రైతు సాధికారత సమావేశం

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకోలి రైతు వేదికలో రైతు సాధికారత ఉత్పత్తిదారుల సంఘం నాలుగో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహిళా అభివృద్ధి సాధికారిక సంస్థ డైరెక్టర్ మురళీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు విత్తనాలు పురుగుమందులు నాణ్యమైనవి అందిస్తామన్నారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సాంకేతికత, శిక్షణ, క్రెడిట్ సౌకర్యాలు, మార్కెట్ యాక్సెస్‌ను అందిస్తామన్నారు. కార్యక్రమంలో రైతు సాధికారిక సంఘ డైరెక్టర్‌లు రాజేశ్వర్, ఎర్రం నరసింహారావు, కనక రమణ ముఖం గంగయ్య, కస్తూరి ఈశ్వర్, రాజేశ్వర్ పాల్గొన్నారు.



ప్రభుత్వం మహిళలకు అందించే చీరల మోడల్

అక్కాచెల్లెమ్మలకు రేవంతన్న చీర కానుక

- జిల్లాకు లక్షా 48వేల 52 చీరల మంజూరు
- మహిళా సంఘాల సభ్యులకు పంపిణీకి ఏర్పాట్లు
- 10 గోదాంలను సిద్ధం చేసిన అధికారులు
- వారం రోజుల్లో జిల్లాకు రానున్న చీరలు

ఆదిలాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇందిరా మహిళా శక్తి పథకంతో మహిళలకు రేవంతన్న కానుకగా చీరలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. యేడాదికి రెండుసార్లు మహిళా సంఘాల సభ్యులకు చీరలను కానుకగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే జిల్లా డీఆర్డీఏ అధికారులతో రాష్ట్రస్థాయి అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. దీంతో అధికారులు అర్హులైన మహిళల జాబితాను సిద్ధం చేశారు. ప్రతీయేడు దసరా పండుగతో పాటు బతుకమ్మ పండుగకు చీరలను కానుకగా అందించనున్నారు. జిల్లాకు లక్షా 48వేల 52 చీరలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో ఆరున్నర మీటర్ల చీరలు 79వేల 644 కాగా 9 గజాల చీరలు 41వేల 776 చీరలను ప్రభుత్వం సరఫరా చేయనుంది. మరోవారం రోజుల్లో జిల్లాకు చీరలు సరఫరాకానున్నాయి. వీటిని భద్రపరిచేందుకు జిల్లావ్యాప్తంగా 10 గోదాములను గుర్తించి డీఆర్డీఏ అధికారులు సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో పంపిణీకి ఏర్పాట్లు చేస్తామని డీఆర్డీఏ పీడీ రాథోడ్ రవీందర్ తెలిపారు.



రోడ్ల నాణ్యతపై రాజీపడేది లేదు

ఎండీ సలావుద్దీన్, డీఈఈ, విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్, ఆదిలాబాద్

ప్ర: రోడ్ల నాణ్యతకు ఏ చర్యలు తీసుకుంటున్నారు?

జ: పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రోడ్ల నాణ్యతపై రాజీపడేదే లేదు. పది కాలాల పాటు పదిలంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. నిధులు

ప్ర: ప్రస్తుతం జిల్లాలో ఎన్నికోట్ల నిధులతో పనులు కొనసాగుతున్నాయి?

జ: ప్రస్తుతం ఎన్ఆర్ఈజీఎస్ కింద సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. సుమారుగా రూ.50కోట్ల నిధులతో పనులు చేపడుతున్నాం.

ప్ర: రోడ్ల నాణ్యతను ఎలా గుర్తిస్తున్నారు?

జ: రోడ్ల నాణ్యతపై క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తున్నాం. ముఖ్యంగా కోర్‌కటింగ్ చేస్తూ అగ్రిగేటెడ్ ల్యాబరేటరి (ఎన్ఏబీఎల్) సహకారంతో శ్యాంపుల్ సేకరించి ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించిన తర్వాత క్వాలిటీ కంట్రోల్ రిపోర్టు ఇస్తున్నాం.

ప్ర: క్వాలిటీ కంట్రోల్ రిపోర్టు ఆధారంగానే ఫైనల్ బిల్లులు చెల్లిస్తున్నారా?

జ: కొన్ని రోడ్లకు క్వాలిటీ కంట్రోల్ రిపోర్టు అవసరం ఉండదు. ఉన్నతాధికారుల పరిశీలన అనంతరం బిల్లుల చెల్లింపు జరుగుతుంది. కొన్ని పథకాల కింద మంజూరైన రోడ్లకు క్వాలిటీ రిపోర్టు లేకుండానే బిల్లులు చెల్లించవచ్చు.

ప్ర: రోడ్ల నాణ్యతపై ప్రజలు, విజిలెన్స్ అధికారులను ఎలా సంప్రదించాలి?

జ: రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టకుంటే విజిలెన్స్ అధికారులను ఫిర్యాదు చేయవచ్చు. రూ.20లక్షలలోపు డీఈఈ పరిధిలో, రూ.20లకు పైగా ఈఈ పరిధిలో ఫిర్యాదు చేయొచ్చు. పీఆర్ అధికారులను ఫోన్‌లో కూడా సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చు.

• ఆదిలాబాద్, ఆంధ్రజ్యోతి




• బేల మండలం మసాల(కె) గ్రామ పరిసర ప్రాంతాల్లో మొరం తవ్వకాలు

ఏజెన్సీలో అడ్డగోలు దందా

- బేల, మసాల (కె)లో విచ్చలవిడిగా మొరం తవ్వకాలు
- నాణ్యత లేని మొరం మట్టితో 353 (బీ) హైవే విస్తరణ పనులు
- ల్యాండ్ లెవలింగ్ పేరిటా రైతులతో రహస్య ఒప్పందాలు
- అధికారులనే తప్పుతోవ పట్టిస్తున్న కాంట్రాక్టర్ కంపెనీ
- మాములుగానే తీసుకుంటున్న మైనింగ్, రెవెన్యూ శాఖాధికారులు


వాహనాలను అడ్డుకుని ఆందోళన చేస్తున్న భవానిగూడ గ్రామస్థులు

ఆదిలాబాద్, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో అడ్డగోలుగా మొరం తవ్వకాలను జరుపుతున్నారు. అభివృద్ధి పనుల పేరిట అధికారులు అందిన కాడికి దండుకుంటు నిబంధనలకు విరుద్ధంగా బడా కాంట్రాక్ట్ కంపెనీలకు అండగా నిలుస్తున్నారు. గత రెండేళ్ల క్రితం జిల్లాలో బోరజ్ నుంచి జైనథ్ మీదుగా బేల మండలంలోని శంకర్‌గూడ వరకు 353 (బీ) జాతీయ రహదారి విస్తరణ పనులను మహారాష్ట్రకు చెందిన ఆర్‌బీగొర్కె ఇన్‌ఫ్రాస్టక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ దక్కించుకుంది. సుమారుగా 33కి.మీల పనులకు గాను రూ.400ల కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు అవసరమైన మొరంను తరలించేందుకు బేల మండలం మసాల(కె) గ్రామానికి చెందిన మడావిలక్మా అనే రైతుకు సంబంధించిన సర్వే నెంబర్ 13/ఏ 2.020 హెక్టార్లలో భూమి లెవలింగ్ కోసం మైనింగ్ శాఖాధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. దీని పై బేల తహసీల్దార్ ఎన్‌ఓసీ జారీ చేయడంతో మైనింగ్ శాఖ అధికారులు 20వేల మెట్రిక్ టన్నుల మొరం తవ్వకాలకు ఆగస్టు 29 నుంచి సెప్టెంబరు 27 వరకు అనుమతులు ఇచ్చారు. ఇందుకు గాను కాంట్రాక్ట్ కంపెనీ రూ.11లక్షల 16వేల 752లను రాయల్టిని చెల్లించిందని అధికారులు చెబుతున్నారు. కాని మొరం మట్టిని తరలిస్తున్న వాహనాల వివరాలను పేర్కొనక పోవడం పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత కాంట్రాక్ట్ కంపెనీ రాత్రి పగలు అనే తేడాలేకుండా అడ్డగోలుగా మొరం తవ్వకాలను చేపట్టడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

లీడ్ ఒకచోట తవ్వేది మరోచోట

జాతీయ రహదారి విస్తరణ పనులను దక్కించుకున్న ఆర్‌బీగొర్కె ఇన్‌ఫ్రాస్టక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అడ్డగోలు పనులు చేస్తుందన్న ఆరోపణలు వస్తున్నాయి. రోడ్డు నిర్మాణ పనులకు అవసరమైన మొరం మట్టిని మహారాష్ట్రలోని యవత్‌మాల్ జిల్లా ఝరి గ్రామ సమీపం నుంచి తీసుకొచ్చేందుకు హైవే ఇంజనీరింగ్ అధికారులు నాణ్యత పరీక్షలు చేసి అనుమతించారు. కాని బేల మండలం మసాల(కె) గ్రామం నుంచి నాణ్యతలేని బండరాళ్ల మొరాన్ని తరలిస్తూ రోడ్డు నిర్మాణ పనులు చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పది కాలాలపాటు పదిలంగా ఉండాల్సిన రోడ్డు నిర్మాణ పనులు మున్నాళ్లకే కుంగి బీటలు (మిగతా 6వ పేజీలో..)

పరిశీలించే అనుమతులు ఇచ్చాం

• కె.రఘునాథ్‌రావ్, తహసీల్దార్, బేల మండలం

ల్యాండ్‌లెవలింగ్ కోసం రైతు దరఖాస్తు చేసుకోవడంతో అన్నిరకాల డాక్యుమెంట్‌ను పరిశీలించి ఎన్‌ఓసీ ఇచ్చాం. దీంతో మైనింగ్ శాఖ మొరం తవ్వకాలకు అనుమతులు ఇచ్చింది. మొరం క్వారీలు తవ్వే భూమి పట్టా ల్యాండ్ కావడంతో అనుమతులు ఇవ్వాల్సి వచ్చింది.

ఆదిలాబాద్‌లో భారీ వర్షం

- బేలలోని చప్రాలలో 57.0మి.మీల వర్షాపాతం నమోదు


జిల్లాకేంద్రంలో కురుస్తున్న వర్షం

ఆదిలాబాద్,సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా భారీవర్షం కురిసింది. గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రివరకు ఓ మోస్తారు వర్షంకు కురుస్తూనే ఉంది. అత్యధికంగా బేలలోని చప్రాలలో 57.0 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే నార్నూర్‌లో 46.0, ఆదిలాబాద్‌అర్బన్‌లో 42.6, గాదిగూడ లోకారి(కె)లో 36.3, జైనథ్‌లో 15.0, ఉట్నూర్ ఎక్స్‌రోడ్డులో 11.5 మి.మీల కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తర్నం వాగు ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అధికారులు సాత్నాల, మత్తడివాగు ప్రాజెక్టు నుంచి వరదను దిగువకు వదిలేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.


అటవీ అమరులకు నివాళులర్పిస్తున్న డీఎఫ్‌వో, అధికారులు

అటవీ అమరుల త్యాగాలు చిరస్మరణీయం

మావల, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): అటవీ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా అటవీ శాఖాధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్ అన్నారు. అటవీ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా గురువారం మావల హరితవనంలో అమరవీరుల స్థూపం వద్ద అమరులైన సయ్యద్ గౌస్, మొయినుద్దీన్, భూక్యా మంత్యా నాయక్ చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ అటవీ సంపదను కాపాడే క్రమంలో ఎందరో ఉద్యోగులు బలయ్యారని అన్నారు. వారి త్యాగాలను స్మరిస్తూ సెప్టెంబర్ 11న అమరవీరుల సంస్మరణ దినం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అటవీసంపదను పరిరక్షించడంలో ఉద్యోగులు కీలకపాత్ర పోషిస్తున్నారని చెప్పారు. అమరవీరుల స్ఫూర్తితో ముందుకు సాగుతూ అటవీ సంపదను పరిరక్షించాలని, పర్యావరణ సమతుల్యత కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌ఓ గులాబ్ సింగ్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌లు గణేష్, శ్రీనివాస్ రెడ్డి, ఎఫ్‌బిఓ కృష్ణ, అమరుల కుటుంబ సభ్యులు సయ్యద్ మాథ్లుబ్ మొయినుద్దీన్, జూనియర్ అసిస్టెంట్ కమల, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

సిరికొండ: అటవీ అమరవీరుల త్యాగాలు మరువలేనివి అని సిరిచెల్మ కవ్వాల్ టైగర్ జోన్ అటవీ క్షేత్రాధికారి నాగవత్ స్వామి అన్నారు. గురువారం అటవీఅమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని విధుల్లో ప్రాణాలను కోల్పోయిన అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అటవీ సంపదను కాపాడే ప్రయత్నంలో భాగంగా ఎందరో ఉద్యోగులు బలయ్యారన్నారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ ప్రతీ ఏటా సెప్టెంబర్ 11న అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. అమరవీరుల స్ఫూర్తితో ముందుకు సాగుతూ అటవీ సంపదను పరిరక్షించాలని, పర్యావరణ సమతుల్యతను కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అటవీశాఖ సెక్షన్ అధికారులు, బీట్ అధికారులున్నారు.

ఉపాధ్యాయులు డిజిటల్ లెర్నింగ్‌ను పెంపొందించుకోవాలి

- సెక్టోరల్ అధికారి రఘు రమణ

తలమడుగు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు అందరూ డిజిటల్ లెర్నింగ్‌ను పెంపొందించుకొని విద్యార్థులందరికీ డిజిటల్ బోధన అందించాలని సెక్టోరల్ జిల్లా అధికారి రఘు రమణ కోరారు. తలమడుగు మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రఘు రమణ మాట్లాడుతూ ప్రాథమిక తరగతులు బోధిస్తున్న కాంప్లెక్స్ ఉపాధ్యాయులు అందరూ డిజిటల్ లెర్నింగ్ నైపుణ్యాలను పెంపొందించుకుని విద్యార్థులకు బోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకట్ రావ్, రిసోర్స్ పర్సన్‌లు, తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న అధికారి

వీరులారా వందనం

- అమరుల యాదిలో స్మృతివనం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు
- పలు మండలాల్లో మంత్రి పర్యటన

7




సమావేశంలో పాల్గొన్న మంత్రి జూపల్లి

వరద నష్టంపై మంత్రి సమీక్ష

ఆదిలాబాద్‌టౌన్, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలతో జరిగిన నష్టంపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పట్టణంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం జరిగిన ఈ సమావేశంలో ఎంపీ గోడం నగేష్, కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఎమ్మెల్యే పాయల్‌శంకర్, వెడ్మబొజ్జులతో పాల్గొన్నారు. జరిగిన నష్టం వివరాలను కలెక్టర్ మంత్రికి వివరించారు. వ్యవసాయ శాఖలో 17,496 ఎకరాలు, 12,775మంది రైతులకు నష్టం వాటిల్లిందని, ఆర్‌అండ్‌బీ, మిషన్‌భగీరథ, పంచాయితీరాజ్, టీడబ్ల్యూఈడీ ఐటీడీఏ, మున్సిపల్, ఇరిగేషన్, ఎన్పీడీసీఎల్, శాఖలకు సంబంధించిన నష్టంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నివేదికను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, నష్టంపై అన్ని సహాయక చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టంచేశారు. రిమ్స్ ఆస్పత్రిలో పెండింగ్‌లో ఉన్న పనులను ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

సీతారాం ఏచూరికి సీపీఎం శ్రేణుల నివాళి

ఆదిలాబాద్‌టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుందరయ్య భవనంలో పార్టీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో క్రియాశీలంగా వ్యవహరించారని, భారత రాజకీయాల్లో అనునిత్యం ప్రజా పక్షం వహిస్తూ అనేక పోరాటాలను నడిపారన్నారు. ఏచూరి స్ఫూర్తితో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ప్రజాకార్మికకర్షక వ్యతిరేక విధానాలపై పోరాటాలను నిర్వహించాలన్నారు. కార్మికవర్గ రాజ్యాన్ని సాధించేందుకు లౌకిక ప్రజాస్వామ్య రక్షణకై పోరాడటమే ఏచూరికి నిజమైన నివాళి అని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంకా రాఘవులు, కిరణ్, దత్తాత్రి ఉన్నారు.


రవికుమార్


నిరుద్‌కుమార్


రాథోడ్‌ఉపేందర్

జాతీయస్థాయి క్రీడాపోటీలకు ఉపాధ్యాయుల ఎంపిక

ఉట్నూర్/తలమడుగు, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో గత రెండురోజులుగా ప్రభుత్వఉద్యోగులకు నిర్వహించిన రాష్ట్రస్థా యి క్రీడాపోటీల్లో ఉట్నూర్ మండలానికి చెందిన ఉపాధ్యాయులు జాతీయస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో ఆశన్న తెలిపారు. రెండురోజులుగా హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉట్నూర్ మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలకు చెందిన చౌహాన్ రవికుమార్ 5కిలోమీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధి ంచారని తెలిపారు. ఉట్నూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన టీచర్ నిరూప్‌నాయక్ బ్యాడ్మింటన్‌లో ద్వితీయ స్థానం, రాథోడ్ ఉపేందర్‌క్రికెట్ విభాగంలో జాతీయస్థాయిలో స్థానం సాధించినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులను స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ జాదవ్‌రమేష్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జ్యోతితో పాటు పాఠశాలల ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే తలమడుగులోని సుంకిడి ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న జి.నాందేవ్ 200 మీటర్ల పరుగు పందెంలో రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానం దక్కించుకొని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నాందేవ్ ఎంపిక కావడంపై హెచ్‌ఎం జైవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు టి.శ్రీనివాస్ స్వామి, బిగ జానంద్, వై.రామ్ రెడ్డి, పి.సుకుమార్, జి. సుజాత, సి. శ్రీనివాస్ రెడ్డి, సంజీవరెడ్డి విద్యార్థిని విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

బాలల రక్షణ కోసమే 1098

మావల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బాలల రక్షణ కోసమే 1098 టోల్‌ఫ్రీ ఏర్పాటు చేసినట్లు మావల మండల ప్రత్యేక అధికారి, జిల్లాబీసీ అభివృద్ధిశాఖ అధికారి కె.రాజలింగు అన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో గురువారం మావల మండలంలోని భట్టిసావర్గం గ్రామపంచాయతీ కార్యాలయంలో (వీసీపీసీ) గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాజలింగు, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్‌లు హాజరై మాట్లాడారు. పిల్లలపై వేధింపులు, బాల్యవివాహాలు జరగకుండా, బాలలందరూ బడికి వెళ్లేలా చూడాల్సిన బాధ్యత కమిటీపైతోపాటు అందరిపై ఉందని అన్నారు. అలాగే బాలల హక్కులను కాపాడుతామని ప్రతిజ్ఞచేశారు. కార్యక్రమంలో ఎల్‌పీవో రమేష్, పంచాయతీ కార్యదర్శి దుర్గయ్యా, షూర్ ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ వినోద్, పాఠశాల హెచ్‌ఎం రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

పలువురికి సన్మానం

మండలంలోని వాఘపూర్‌లో బాలల పరిరక్షణ హక్కులు, విద్యాబ్యాసంపై సెమినార్ నిర్వహించారు. ఈ మేరకు పలువురు వక్తలు మాట్లాడారు. అనంతరంమండల సమాఖ్య ఏపీఎంగా బాధ్యతలు చేపట్టిన ప్రసాద్‌రాజ్‌ను కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్ గ్రామపెద్దలతో కలిసి సన్మానించారు. అలాగే జడ్పీ పాఠశాల హెచ్‌ఎంగా బాధ్యతలు చేపట్టిన మహేష్‌ను, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డు గ్రహీత ప్రతాప్ సింగ్‌ను సైతం సన్మానించారు. ఇందులో డాక్టర్ రోజారమణి, గ్రామస్థులున్నారు.


ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారి రాజలింగు, పాల్గొన్న కమిటీ


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పోక్సో యాక్ట్‌పై అవగాహన

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మిషన్‌శక్తి - సంకల్ప్ (హబ్ ఫర్ ఎంపవర్‌మెంట్), స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 10 రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం పోక్సో యాక్ట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీంతోపాటు సఖీ సర్వీసెస్, హెల్ప్ లైన్ నంబర్స్, సైబర్‌క్రైమ్, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మారుతి, అధ్యాపకులు, లెక్చరర్ శివరాజ్, శ్రీలత, ప్రేమల, మహిళా సాధికారత జెండర్ స్పెషలిస్ట్ కృష్ణవేణి, కోటేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేను రాను.. సర్కారు దవాఖానకు

- ఆసుపత్రికి వచ్చేందుకు నిరాకరించిన గర్భిణి
- భయంతో చేనులో తలదాచుకున్న వైనం
- వెతికి ఆసుపత్రికి తరలించిన సిబ్బంది
- రిమ్స్‌లో మగబిడ్డకు జన్మనిచ్చిన ఆదివాసీ మహిళ


పత్తి చేనులో తలదాచుకున్న గర్భిణీ


రిమ్స్ ఆసుపత్రిలో ప్రసవం అనంతరం మగ బిడ్డతో భీంబాయి

ఆదిలాబాద్/ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): ప్రసవం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేందుకు ఓ గర్భిణీ నిరాకరించడంతో వైద్య సిబ్బంది రోజంతా హైరాన పడ్డారు. ఆదిలాబాద్ రూరల్ మండలం దహిగూడ గ్రామానికి చెందిన ఆత్రం భీంబాయి నిండు గర్భిణి. ఆమెను ప్రసవం కోసం రిమ్స్ ఆసుపత్రికి తరలించేందుకు గురువారం అంకోలి పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది దహిగూడ గ్రామానికి వెళ్లగా గర్భిణి ఇంట్లోలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. కానీ ఆమె కోసం వైద్యసిబ్బంది వస్తున్నారన్న సమాచారాన్ని తెలుసుకుని భయంతో ఇంటి నుంచి వెళ్లిపోయి గ్రామ సమీపంలో ఉన్న పత్తిచేనులో తలదాచుకున్నట్లు సమాచారం అందింది. వెంటనే పంటచేనులో దాదాపు గంట సేపు వెతకగా పత్తిచేనులో తన కుమారునితో ఉన్న గర్భిణీని గుర్తించారు. ఆమెకు కౌన్సిలింగ్ చేసి ఒప్పించిన తర్వాత ఆసుపత్రికి వచ్చేందుకు ఆమె ఒప్పుకుంది. దీంతో ఆమెను తరలించేందుకు అంబులెన్స్‌కు కాల్‌చేసిన కొద్దిసేపటికే పురిటి నొప్పులు మొదలయ్యాయి. వెంటనే జిల్లాకేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించిన గంటలోపే ఆరోగ్యవంతమైన పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లీబిడ్డ ఆరోగ్య పరిస్థితి మెరుగుగానే ఉందని అంకోలి ఎంఓ డాక్టర్ సర్ఫరాజ్, మోయిజుద్దిన్, శ్యామల, ముయ్యాలమోతి, చంద్రకళ, జయ, ఆశ తెలిపారు.